క్లుప్తంగా

సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి

వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా నారపరెడ్డి సుధాకర్ రెడ్డి ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాంస్కృతికం పట్ల ప్రత్యేక చొరవ చూపుతుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శివమణి, రాధ, ఎరికలప్ప, సూర్యనారాయణరాయల్, చెవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ విరాళం



రామాలయంవద్ద నాయీబ్రాహ్మణులతో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని నాయీబ్రాహ్మణ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.50 వేలు విరాళం అందజేశారు. శనివారం సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ఎంపీ విరాళాన్ని స్థానిక నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకారం అందించిన ఎంపీ మిథున్ రెడ్డికి నాయీ బ్రాహ్మణ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు ఆనంద్, చక్రధర్, ఎం. ప్రదీప్ కుమార్, ఆనంద్, మురళి, రమణ, శివమ్మ, రామచంద్ర, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు ఆసక్తి సున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ జయరాణి పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని పోతుపేట అంగన్‌వాడీ కేంద్రంలో (ఎస్సీ), కొటాలవాండ్లపల్లి (బీసీ–బీ), గుగ్గిళ్ళపల్లి (బీసీ–బీ), బెట్టకొండ (ఎస్సీ), బూర్లపల్లి టూ (బీసీ–బీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11 లోపు ధృవీకరణ పత్రాలను తంబళ్ళపల్లి ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులోని ఈదలవంక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ఉబ్బ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శనివారం కనుల పండువగా సాగింది. ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, కళాహోమం, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వ్యాసముద్రం, బత్తాలపురం కుటుంబీకులు భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

చింతపర్తి సెక్రటరీగా నాగేంద్ర బాబు

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి మేజర్ పంచాయతీ సెక్రటరీగా నాగేంద్ర బాబు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న పాండురంగయ్య మండలంలోని టి.సాకిరేవుపల్లికు బదిలీ కాగా ఆయన స్థానంలో నాగేంద్రబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెక్రటరీ నాగేంద్ర బాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

యాషికా అకాడమీలో ఇంటర్న్‌షిప్



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి విరాళం అందజేస్తున్న ఎల్ఐసీ రవీంద్రరెడ్డి

మదనపల్లె సిటీ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ చివరి సంవత్సరం విద్యార్థులకు స్థానిక కదిరిరోడ్డులోని యాషికా అకాడమీలో ఇంటర్న్‌షిప్‌లో ఇవ్వనున్నారు. ఈ మేరకు అకాడమీ డైరెక్టర్ యశ్వంత్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు విలువైన ఆచరణాత్మక అనుభవాన్ని మెరుగుపరచడానికి ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుందన్నారు. యాషికా అకాడమీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ మధ్య సహకారంతో ఇంటర్న్‌షిప్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేల విరాళం

కేవీపల్లె : వాల్మీకిపురం సాయి నారాయణ సేవట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి కేవీపల్లెకు చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుక్మిణమ్మ, ఎల్ఐసీ రవీంద్రరెడ్డి రూ. 50 వేలు విరాళాన్ని శనివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమంలో దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్పరెడ్డి, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పరిహారం ఇప్పించండి

- పునరావాసానికి భూములిచ్చిన రైతుల వేడుకోలు
- రైతులతో సమావేశమైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సందీప్, గోపాలకృష్ణ, ఆర్డీవో ఎంఎస్.మురళి

మదనపల్లె : ప్రభుత్వ భూసేకరణలో భూములు కోల్పోతున్న తమకు మెరుగైన నష్టపరిహారంతో పాటూ ఇంటి స్థలాలు ఇప్పించాలని రైతులు అధికారులకు విన్నవించారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ సమావేశ భవనంలో ముదివేడు బాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు బాధితులకు పునరావాసన ఏర్పాటుకై భూములిచ్చిన రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సందీప్, హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీవో ఎంఎస్.మురళి, ఇరిగేషన్ ఈఈ సురేంద్రరెడ్డిలు సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూముల వివరాలను అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు జాతీయ రహదారికి భూసేకరణలో భాగంగా ఎకరాకు రూ.27 లక్షలు నష్టపరిహారం లభించిందని, అదే స్థాయిలో తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. పరిహారంతో పాటూ భూములు కోల్పోతున్న కారణంగా తమకు అదే స్థలంలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని విన్నవించారు. రైతులు నివేదించిన విషయాలపై ఉన్నతాధికారులు నివేదికలు పంపుతామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో ఎంఎస్.మురళి తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు బాధితులు కురబలకోట మండలంలోని రెండు గ్రామాలు బి.కొత్తకోట మండలంలోని రెండు గ్రామాల్లో 230 కుటుంబాలు ఉన్నాయన్నారు. రిజర్వాయర్ నిర్మాణం కారణంగా వారు తమ ఇళ్లు, పొలాలు పూర్తిగా కోల్పోవాల్సి వచ్చిందన్నారు. బాధితులకు రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్‌మెంటేషన్ (ఆర్అండ్ఆర్)లో భాగంగా పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పునరావాసంలో భాగంగా పూర్తిస్థాయి ఇంటి నిర్మాణాలు, రోడ్లు, మౌళిక సౌకర్యాలు, బడి, గుడి, మసీదు తదితర సౌకర్యాలను ముంపు బాధితులకు కల్పించడం జరుగుతుందన్నారు. ఆ మేరకు వారు కోరుకున్న విధంగా కురబలకోట మండలం ముదివేడు తానామిట్ట వద్ద జాతీయ రహదారి పక్కనే 30 ఎకరాలు భూమి 16 మంది రైతుల నుంచి సేకరించడం జరిగిందన్నారు. భూములిచ్చిన రైతుల సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. రైతులకు మెరుగైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌వో కులదీప్‌రెడ్డి, ఫారెస్ట్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల హవా

నిమ్మనపల్లె : పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి మెరిశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులై ప్రతిభ చాటారు. మండలంలోని నిమ్మనపల్లె, నిమ్మనపల్లె ఉర్దూ, బాలినాయునిపల్లె, రెడ్డివారిపల్లె, కేజీబీవీ విద్యాలయం, రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ నుంచి 332 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా 220 మంది, 66.26 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో రాజగోపాల్ తెలిపారు.

బీసీ సంక్షేమ హాస్టల్‌లో..

మదనపల్లె సిటీ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప తెలిపారు. జిల్లాలో 31 బీసీ హాస్టల్‌లో పదో తరగతి 338 మంది పరీక్షలు రాశారని ఇందులో 277 మంది పాసైనట్లు తెలిపారు. ఇందులో ఫస్ట్‌క్లాస్ 175, సెకండ్ క్లాస్ 66, థర్డ్ క్లాస్ 36 మందికి వచ్చినట్లు పేర్కొన్నారు. 71.39 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఎంజేపీఏపీబీసీడబ్ల్యు రెసిడెన్షియల్ పాఠశాలల్లో నందలూరులో 72 మంది, కలికిరిలో 67, పీలేరు 69,తంబళ్లపల్లె 28 మంది పాసైనట్లు తెలిపారు.

రామసముద్రం : మండలంలో విద్యార్థులు మంచి ప్రతిభ సాధించినట్లు ఎంఈవో లత తెలిపారు. మండలంలో పదిలో 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల ప్రతిభకు హెచ్ఎంలు , ఉపాధ్యాయులు అభినందించారు.

వాల్మీకిపురం : మండలంలో 2023 పదవ తరగతి పరీక్షలకు 517 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 371మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి వెంకటరత్నం శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా 156మంది విద్యార్థులు ఫైలయ్యారని, దీంతో మండలంలో 80శాతం ఫలితాలు నమోదయ్యాయన్నారు.

కలికిరి : కలికిరిలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు 67 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. మండలంలోని గడి ఉర్దూ పాఠశాలలో 90శాతం, మహల్ ఉర్దూ పాఠశాలలో 70శాతం, మేడికుర్తి జడ్పీహెచ్ఎస్‌లో 60శాతం, కలికిరి బాలికోన్నత పాఠశాలలో 58శాతం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 54శాతం, మహల్ జెడ్పీహెచ్ఎస్‌లో 47శాతం, టి.చదివేవాండ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 33శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ రంగనాథరెడ్డి తెలిపారు.

గుర్రంకొండ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల మొత్తం మీద 50.77 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

కేవీపల్లె : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. మండలంలో మొత్తం 478 మంది పరీక్షలు రాయగా 354 మంది ఉత్తీర్ణులై 74.06 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

కలకడ : పదవతరగతి పరీక్ష ఫలితాల్లో కలకడ మండలంలోబాలికలదే హవా కొనసాగింది. గురుకులపాఠశాలలో 64 మందికి 62 మంది ఉత్తీర్ణత సాధించారు. నడిమిచెర్ల ఉన్నతపాఠశాలలో 28 మందికి 25 మంది ఉత్తీర్ణత సాధించారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని 10 ప్రభుత్వ స్కూళ్లలో 306 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 226 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు.

ములకలచెరువు: మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం వెలుబడిన పది పరీక్ష ఫలితాల్లో 48 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలం మొత్తం 482 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 230 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బురకాయలకోట జెడ్పీహైస్కూల్ 50 శాతం , దేవులచెరువు జెడ్పీహైస్కూల్ 58 శాతం, ములకలచెరువు జెడ్పీహైస్కూల్ 35 శాతం, కస్తూరిబా పాఠశాల 39 శాతం, బురకాయలకోట గురుకుల పాఠశాల 64 శాతం, , సోంపల్లి జెడ్పీహైస్కూల్ 34 శాతం, చౌడసముద్రం జెడ్పీహైస్కూల్ 36 శాతం, మోడల్‌స్కూల్ 58 శాతం ఉత్తీర్ణత సాధించారు.

తంబళ్లపల్లె : మండలంలో శనివారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో 73.28 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. మోడల్ స్కూల్ బాలికలు అత్యధిక మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచినట్లు తెలిపారు.

కురబలకోట : మండలంలోని ముదివేడు దగ్గరున్న ప్రభుత్వ మోడల్ స్కూల్ పది ఫలితాల్లో టాప్ లేపారు. మండలంలోనే ఈ స్కూల్ ప్రథమ స్థానంలో నిలచినట్లు ఎంఈఓ ద్వారకనాథ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యోజన గాంధి తెలిపారు. 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 78 మంది పాసయ్యారు. 86 శాతం ఉత్తీర్ణత సాధించింది. ముదివేడు దగ్గరున్న కెజిబీవీ స్కూల్ 74 శాతం, అంగళ్లు జడ్పీ హైస్కూల్, ముదివేడు జడ్పీ హైస్కూల్ 58 శాతం, తెట్టు జడ్పీ హైస్కూల్ 53, కురబలకోట జడ్పీ హైస్కూల్ 24 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

బి.కొత్తకోట : మండలంలోని పది ఉన్నతపాఠశాలల్లో 606 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 354 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో ఆర్.రెడ్డిశేఖర్ తెలిపారు.

నిరుద్యోగుల పక్షపాతి వైఎస్ జగన్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్

మదనపల్లె సిటీ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగుల పక్షపాతి అని చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎఆర్ నాగరాజ్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998 డిఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల నాటి కలను ముఖ్యమంత్రి నిజం చేశారన్నారు. అనంతరం నూతన తాత్కాలిక కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామి, కోశాధికారిగా శివారెడ్డిలను ఎన్నుకున్నారు. పదవి విరమణ వయస్సు 62కు పెంచాలని, మిగిలిన అభ్యర్థులకు 60 దాటిన వారికి ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించాలని తీర్మానం చేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

వాల్మీకిపురం : అధిక సంఖ్యలో కేసులు పరిష్కారానికి అధికారులందరూ సహకరించాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జ్ జడ్జి అసీఫాసుల్తానా శనివారం తెలిపారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ అపీల్‌లేని అంతిమవిజయం లోక్ అదాలత్‌లోనే సాధ్యమని, సత్వర న్యాయం జాతీయలోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల13వ తేదీన కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. దీర్ఘకాలిక పెండింగ్ కేసులు, సివిల్, క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా ఒకే రోజులో పరిష్కారం పొందవచ్చునని సూచించారు. అన్ని శాఖల అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించి, లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వైభవంగా కోదండ రాముడి రథోత్సవం

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారంలో శనివారం కోదండ రామస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మొలకల పౌర్ణమి సందర్భంగా నిర్వాహకులు కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం రథోత్సవాన్ని గ్రామంలోని పురవీధుల్లో కోలాహలంగా జరుపుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా రథోత్సవం

మదనపల్లె సిటీ : గోవిందనామస్మరణలతో రథోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవంపై స్వామిని ఆలయం నుంచి అప్పారావువీధి, మసీదువీధి,కమ్మవీధి, సంతబజారు వీధి, రీడింగ్‌రూమువీధి, నెహ్రూనగర్‌లలో ఊరేగించారు. భక్తులు గోవిందనామాలు జపిస్తూ రథాన్ని భక్తి శద్ధలతో లాగారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.



కోలాహలంగా కోదండ రామస్వామి రథోత్సవం



రథోత్సవంపై ఊరేగుతున్న స్వామివారు

ఆస్పత్రుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తాం



ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఈ ధనుంజయరెడ్డి

పీలేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వాస్పత్రుల నిర్మాణ పనులు జూన్ ఆఖరు లోపు పూర్తి చేస్తామని కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఈఈ ధనుంజయరెడ్డి అన్నారు. శనివారం పీలేరు వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వంద కోట్లతో నాలుగు ఏరియా ఆస్పత్రులు పీలేరు, శ్రీకాళహస్తి, నగిరి, పలమనేరులో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది 50 పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నట్లు చెప్పారు. అలాగే రెండో విడతలో గంగాధరం నెల్లూరులో రూ. 26 కోట్లతో కార్వేటి నగరం, పెనుమూరులో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణ పనులు ప్రారంభం అయినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు కొరవడకుండా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పీలేరు ఏరియా ఆస్పత్రి పనులు చురుగ్గా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో దశల వారీగా ఆస్పత్రుల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులు



ఎస్‌జీ కళాశాల ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పీలేరురూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శనివారం స్థానిక సంజయగాంధీ డిగ్రీ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులు, బాలికల వసతి గృహం, ఆటస్థలం, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక డిగ్రీ కళాశాల స్వయంప్రతిపత్తి హోదా పొందడానికి అన్ని అర్హతలు కలిగి ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

హౌసింగ్ పీడీ సాంబశివయ్య



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న పీడీ శివయ్య

పీలేరురూరల్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ శివయ్య తెలిపారు. శనివారం మండలంలోని కంకరప్యాక్టరీ లేఅవుట్, ఏపీఐఐసీ లేవుట్లను పరిశీలించారు. మౌళిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 77,539 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు 19,633 ఇళ్లు పూర్తి అయ్యాయయని, 4192 మోల్డింగ్ వేశారని, 21,233 గుణాంతాల నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపారు. 938 ఇళ్లు ఇంకా ప్రారంభించలేదన్నారు. పీలేరు నియోజకవర్గంలో 12,030 మంజూరై వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాలు గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ బాలాజీ నాయక్, వర్క్ ఇన్స్‌పెక్టర్ అక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

వాల్మీకిపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని జర్రావారిపల్లి, అయ్యవారిపల్లి సచివాలయాలు, సంపద కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని, ప్రజలకు సత్వర సేవలు అందించాలన్నారు. అలాగే జర్రావారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు ప్రతి రోజు పాలు, గ్రుడ్డుతో పాటు భోజనం తీసుకునే విధంగా చూడాలన్నారు. అలాగే నిత్యం గర్భిణులు కాల్షియం, ఐరన్ మాత్రలు తీసుకునేలా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల పరిధిలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పొట్టిగా ఉన్న పిల్లలను ఖచ్చితంగా గుర్తించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, ఈవోపీఆర్‌డీ శకుంతల, పంచాయతీ కార్యదర్శి అశ్విని, సర్పంచ్ మునిభాస్కర, నాయకులు ఆనంద, చంద్రశేఖర్, రవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ యూత్ జిల్లా అధ్యక్షుడిగా నరేష్

పీలేరు రూరల్ : సమతా సైనిక్ దళ్ యూత్ జిల్లా అధ్యక్షుడిగా పీలేరుకు చెందిన మలతోటి నరేష్ నియమితులయ్యారు. శనివారం తిరుపతి ఎస్ఎస్‌డీ కార్యాలయంలో సమతా సైనిక్ దళ్ జాతీయ అధ్యక్షులు దిగంబర్ కాంబ్లే చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ప్రేరణతో బడుగు, బలహీన వర్గాల కోసం, న్యాయమైన హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సాయిచరణ్



మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో డాక్టర్ సాయిచరణ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో జిల్లా ఆసుపత్రి డాక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుని నియమితులయ్యారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి దేవిని మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో పాల్గొన్నారు. గతంలో కర్ణాటక రాష్ట్రం కోలారు జాలప్ప ఆసుపత్రిలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశానని, ప్రస్తుతం స్థానిక వైద్యశాలలో డి.అడిక్షన్ సెంటర్‌లో బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

మదనపల్లె : మండలంలో సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మండలంలో చేపట్టిన పనులన్నింటినీ సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. తనిఖీ బృందానికి ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అవసరమైన రికార్డులను అందజేయాలన్నారు. సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించేలా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2022 – 23 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల వేతనాలకుగానూ రూ.4.11 కోట్లు, సామాగ్రి పనులకు రూ.2.47 కోట్లు మొత్తంగా రూ.6.59 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈనెల 12వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ ఏఈ పీవీ.రమణ, డీఆర్పీలు నూతనపవన్, సీహెచ్.శ్రీనివాసులు, బొమ్మప్ప, మద్దిలేటిస్వామి, నవీంద్ర, ఎస్.శ్రీనివాసులు, పవన్, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న రెండు వేర్వేరు 16 సెంట్లు, 13 సెంట్లు స్థలాలను అద్దెకు ఇవ్వడం జరుగుతుందని, వీటిని ఔత్సాహిక వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఆర్ఎం రాము కోరారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ళకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు అద్దెకు ఇవ్వడం జరుగుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఖాళీగా ఉన్న ఐదు అంగడి రూములకు అద్దె తగ్గించి కేటాంచాలని కొందరు వ్యాపారులు కోరారు. బస్టాండ్‌లో కంట్రోలర్ నియామకం, కార్గో సేవలు మరింత మెరుగుపరచాలని స్థానికులు ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీటీఎం రమేష్ బాబు, పీలేరు డీఎం బండ్ల కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే విధంగా ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : అన్ని వర్గాల ప్రజలు మెచ్చే విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ పాలన నడుస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గర్నిమిట్ట పంచాయతీలో మూడో రోజు శనివారం బాటవారిపల్లె, మిరియాలవారిపల్లె, కురవపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఒంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడం తోపాటు ఎన్నో సరికొత్త పథకాలు తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమానికి రైతులు, మహిళలు, విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకారం ప్రకటించిన తేదీన ముఖ్యమంత్రి బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ అవుతున్నాయని చెప్పారు. పేదవాడి కళ్లలో ఆనందం చూడాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పరితపించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. నవరత్నాల పథకాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని, రాష్ట్రంలో సువర్ణ పరిపాలన కొనసాగాలంటే ప్రజలు మద్దతు ఉండాలన్నారు. ఏవైనా చిన్నచిన్న కారణాలతో ప్రభుత్వ పథకాలు అందకుండా ఉంటే అధికారులు వాటిని సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనేరెడ్డి, సర్పంచ్ రమణమ్మ, నాయకులు వెంకటరమణారెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, వెంకటసిద్ధులు, రవికుమార్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, ఆనందరెడ్డి, ద్వారకనాథరెడ్డి, జయరామచంద్రయ్య, లక్షుమరెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.